క్లుప్తంగా

నేడు విద్యుత్ విజయోత్సవ సభ

అచ్చంపేట రూరల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం అచ్చంపేటలోని శ్యామ్స్ ఫంక్షన్ హాలులో విద్యుత్ విజయోత్సవ సభ నిర్వహించనున్నట్లు విద్యుత్‌శాఖ అచ్చంపేట ఏఈ ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజుతో పాటు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది హాజరవుతారని తెలిపారు.

బాల్యవివాహాలు చేయడం నేరం



అచ్చంపేట రూరల్: బాల్యవివాహాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఏసీడీపీఓ కమల అన్నారు. ఆదివారం అచ్చంపేట సెక్టార్‌లో పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల్యవివాహాలు, చిరుధాన్యాలు, జీవన నైపుణ్యాలపై గర్భిణులు, బాలింతలు, మహిళలకు అవగాహన కల్పించారు. విజయమణెమ్మ, ప్రియదర్శిని, సంధ్య, సుగుణ పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



తాడూరు: మండలంలోని గుంతకోడూరుకి చెందిన జావీద్, భాస్కర్ అదే గ్రామానికి చెందిన సైదులు ఇంటిపై దాడి చేయడంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దళితుడైన సైదులు ఇంటిపై దాడి చేసి కులం పేరుతో దూషించి అవమానపరిచిన భాస్కర్, జావేద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కేవీపీఎస్ నాయకులు నర్సింహ, చంద్రయ్య, మణ్యం, పరశురాములు, బంగారయ్య పాల్గొన్నారు.

కేఎల్ఐ కాల్వలను ఆధునీకరించాలి

కొల్లాపూర్: కేఎల్ఐ కాల్వల ఆధునీకరణకు చర్యలు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి తుమ్మల శివుడు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేఎల్ఐ ప్రాజెక్టు పరిధిలోని కాల్వలకు సీసీ లైనింగ్ లేకపోవడంతో నీళ్లు ముందుకు పారడం లేదన్నారు. ముళ్లపొదలు, జమ్ముగడ్డి పెరిగి కాల్వలు అధ్వానంగా మారాయన్నారు. అధికారులు స్పందించి కాల్వలకు సీసీ లైనింగ్ చేయించాలన్నారు.

ఎమ్మెల్సీ సహకారంతో సమస్యకు పరిష్కారం

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్రలో ఇటీవల గాలివానకు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో రైతులు సమస్యను బీఆర్ఎస్ నాయకుడు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కసిరెడ్డినారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన విద్యుత్ అధికారులతో మాట్లాడి కొత్త స్తంభాలను ఏర్పాటు చేయించారు. అల్లాజి, శ్రీను పాల్గొన్నారు.

బెల్టుల ప్రదానం

కందనూలు: జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం తైక్వాండో కలర్ బెల్ట్ పరీక్షలు నిర్వహించినట్లు కార్యదర్శి మాస్టర్ రవికుమార్ తెలియజేశారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులను ప్రదానం చేశారు. అబ్దుల్లాఖాన్, స్వాతి. వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



తాడూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2003–04 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ఆదివారం ఉన్నత పాఠశాల ఆవరణలో కలిసి ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అప్పట్లో వారికి చదువుచెప్పిన గురువులతో ఆత్మీయంగా కలిసిపోయారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వఉపాధ్యాయులు భగవంతురెడ్డి, యాదగిరి, తదితరులను విద్యార్థులు సన్మానించారు.

మన్ననూర్: స్థానిక గిరిజన ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1990–91లో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ఈ అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలోని వనమాళికా ప్రాంగణంలో సుమారు 30 మంది విద్యార్థులు ఒక్కచోటు చేరి గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మన్సూర్, సత్యం, రఘు, చారీ, ప్రసన్న, శోభ, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



ముమ్మరంగా బడిబాట

లింగాల: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఆయా పాఠశాలల ప్రగతిని కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. బడిఈడు పిల్లలను పనిలో కాకుండా పాఠశాలలకు పంపాలని, ప్రైవేటు పాఠశాలల కన్న ప్రభుత్వ పాఠశాలలే మిన్న అంటూ బడిబాటను కొనసాగించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు శేఖర్, తాహెర్‌పాష, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



లింగాలలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



తాడూరులో వివరాలు సేకరిస్తున్న ఉపాధ్యాయులు

కొనసాగుతున్న కార్యక్రమం

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం కొనసాగిస్తున్నారు. ఈ నెల 13 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో ఆదివారం ఆయా గ్రామాల్లో బడిఈడు కలిగిన పిల్లల ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాలల హెచ్ఎంలు ఆనంద్, సాయిప్రభ, అర్జున్ తదితరులు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని సూచించారు.

గ్రామదేవతలను స్మరించడం సంప్రదాయం



తాడూరు పూజలో పాల్గొన్న మాజీ మంత్రి నాగం

తాడూరు: గ్రామ దేవతలను స్మరించుకోవడం తెలంగాణ సంప్రదాయమని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని యాదిరెడ్డిపల్లిలో నిర్వహించిన బొడ్రాయి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలు పచ్చని పంట పొలాలతో కళకళలాడుతూ ఉండాలంటే ఆనాటి నుంచి వచ్చే సంస్కృతి సాంప్రదాయాల్లో భాగంగా గ్రామ దేవతలను స్మరించుకుని ప్రత్యేక పూజలు చేయాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య, రవి, నాగం శశిధర్‌రెడ్డి, బాలగౌడ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

బొడ్రాయికి ప్రత్యేక పూజలు

వెల్దండ: మండల కేంద్రంలో ఆదివారం బొడ్రాయికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించి ఏడాది పూర్తికావడంతో పూరోహితుల సూచనాల ప్రకారం పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక బోనం చేసుకుని డబ్బువాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. ఇంటింట ఒక బిందె నీటితో మహిళలు పెద్దసంఖ్యలో చేరుకుని బొడ్రాయికి నీరు పోసి పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరెడ్డి, నిరంజన్, నాయకులు తదితరులు ఉన్నారు.



వెల్దండలో ప్రత్యేక బోనాలతో ఊరేగింపు

మైసమ్మ జాతరకు భక్తుల రద్దీ



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో హాజరై మైసమ్మ దేవతకు నైవేద్యాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతరకు వివిధ ప్రాంతాల నుంచి గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, పెబ్బేరు, వివిధ ప్రాంతాల నుంచి ప్రైవేటు వాహనాల్లో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. వానాకాలం సీజన్ ప్రారంభమయ్యే ముందు రైతులు, వ్యవసాయ కూలీలు వచ్చి పంటలు బాగా పండాలని మైసమ్మ దేవతకు నైవేద్యాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులను చేరవేసేందుకు నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి ప్రాంతాల నుంచి ఆర్టీసీ వారు భక్తులను, ప్రయాణికులను చేరవేశారు. ఈ వారం దాదాపు ఆరువేల మంది భక్తులు హాజరైనట్లు ఎండోమెంట్ అధికారి తెలియజేశారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి



సీపీఎం నాయకుల నిరసన

నాగర్‌కర్నూల్ రూరల్: కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు భూములు ఇచ్చిన భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జి అశోక్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని దేశిటిక్యాల గ్రామ ప్రజలు ఆయా కార్యాలయాలకు వారికున్న భూములు ఇచ్చి నిర్వాసితులు అయ్యారని, అందులో అత్యధికంగా ఎస్సీలు, బీసీలు మాత్రమే ఉన్నారని, భూములు ఇచ్చిన సందర్భంలో 5 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. వారికి కలెక్టర్ కార్యాలయంలో ఉండే ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 6న ప్రారంభించనున్న కలెక్టర్, ఎస్పీ, బీఆర్ఎస్ కార్యాలయాల్లో భూములు కోల్పోయిన నిర్వాసితులను గౌరవించాలని, వారికి సరైన న్యాయం అందించాలన్నారు. పరశురాం, రాము, రాజు, మల్లయ్య, సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం బాగు

అమ్రాబాద్: పౌష్టిక ఆహారంతోనే ఆరోగ్యం బాగుంటుందని ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి అన్నారు. ఆదివారం మండల కేంద్రం పదరలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని కిశోర బాలికలు, గర్భిణులు, బాలెంతలకు పౌష్టికాహారంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మాతా శిశు రక్షణ కోసం అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, టీచర్లు విజయలక్ష్మి, జుబేదాబేగం, పద్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యప్రదర్శన



నృత్యప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

తెలకపల్లి: మండల కేంద్రంలోని కేకేరెడ్డి పాఠశాలలో విద్యార్థులకు స్వర్ణభారతి కళానిలయం కల్వకుర్తి ఆధ్వర్యంలో 35 రోజుల పాటు వేసవి సంగీత, నృత్య శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. శనివారం రాత్రి ఈ శిబిరాల ముగింపు వేడుకలు నిర్వహించారు. శిబిరాల్లో విద్యార్థులు కూచిపూడి, శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాలు, ప్రాశ్చాత్య నృత్యాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన కళాప్రదర్శనను ఆ పాఠశాల అధ్యక్షుడు రఘురాం రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బాలగౌడ్, ఎంపీటీసీ రమేష్, రంగస్థల కళాకారులు రఘుపతి, ప్రిన్సిపాల్ బాలు, స్వర్ణభారతి కళానిలయం వ్యవస్థాపక నిర్వణ బాధ్యులు నారోజ్ మోహన్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

బీఆర్ఎస్ కార్యకర్తలకే పథకాలు

అచ్చంపేట రూరల్: దళితుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు దళితులకు పూర్తిస్థాయిలో అందలేదని మాలల చైతన్య సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మూలె కేశవులు ఆరోపించారు. ఆదివారం అచ్చంపేటలోని ఆర్అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలకే పథకాలు అందిస్తున్నారని ఆరోపించారు. దళితబంధు పథకం పూర్తిస్థాయిలో అందలేదని, మూడెకరాల భూమి ఎక్కడని ప్రశ్నించారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, సుధాకర్, తిర్పతయ్య, కొండల్, రవికుమార్, రఘుపతి, గణేష్, సత్యం, ఎల్లస్వామి, బాలస్వామి, పర్వతాలు, కాశన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేశవులు

వ్యక్తికి తీవ్ర గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి చెందిన రామన్‌గౌడ్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. వేగంగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో రామన్‌గౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించి ఎస్ఐ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలియజేశారు.

ఉపాధ్యాయుడి మృతి తీరని లోటు

తాడూరు: బడిబాట కార్యక్రమానికి వెళ్తున్న మండలంలోని మేడిపూర్ ఉన్నత పాఠశాల హెచ్ఎం బిచ్చారావు(50) రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం దిగ్భ్రాంతికి గురిచేసిందని మండలంలోని ఆయా ఉపాధ్యాయ సంఘాల నేతలు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో సౌమ్యుడిగా ఉండి సమయపాలన పాటించే నిబద్ధత కలిగిన ఉపాధ్యాయుడిని ఉపాధ్యాయ లోకం కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన పారిజాత కుటుంబానికి ఆదివారం సింగల్‌విండో డైరెక్టర్ వెంకటయ్యగౌడ్ రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. పారిజాత అనారోగ్యంతో బాధపడుతుందన్నారు. వారి కుటుంబ పోషణ భారంగా ఉండటంతో వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



తెలకపల్లి: బాధితురాలికి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఎల్‌ఓసీ అందజేశారు. మండల పరిధిలోని పెద్దపల్లికి చెందిన సుశీల కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఆమె మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకుంది. దీంతో సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2 లక్షలు మంజూరయ్యాయి. పెద్దపల్లి బంగారయ్య, గ్రామస్తులు సుధాకర్ బాధితులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి..

ఉప్పునుంతల: మండలంలోని పెద్దాపూర్‌కు చెందిన తాళ్ల బాలస్వామి కుమార్తె పావనికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష ఎల్‌ఓసీని ఆదివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు చేతులమీదుగా అందజేశారు. పావని 15 రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడి నిమ్స్ ఆస్పత్రిలో ప్రస్తుతం చికిత్స పొందుతుంది. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కృషితో సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం మంజూరైనట్లు చెప్పారు. గ్రామస్తులు కేశవరావు, జగదీష్, లింగమయ్య పాల్గొన్నారు.

రైతు సంబరాలు జరుపుకోవడం విడ్డూరం

పెంట్లవెల్లి: రాష్ట్రంలో రైతులు పడుతున్న కష్టాలు, ఇబ్బందులను చూడకుండా రుణమాఫీ చేయకుండా నష్టపోతున్న వరి, పత్తి రైతులను ఆదుకోకుండా రైతు సంబరాలు నిర్వహించడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ అన్నారు. ఎంతో మంది నానా రకాలుగా రైతులు నష్టపోతూ ఉంటే రైతులు ఆనందంగా ఉన్నారని, లాభాల్లో ఉన్నారని, రైతుల పేరు చెప్పి దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం రైతాంగానికి సిగ్గుచేటు అన్నారు. నర్సింహనాయుడు, డిష్‌రవి పాల్గొన్నారు.

క్రికెట్ కిట్టు పంపిణీ

వెల్దండ: మండల పరిధిలోని గాన్‌గట్టుతండాకు చెందిన సర్పంచ్ పత్యనాయక్ ఆదివారం వ్యక్తిగతంగా క్రీడాకారులకు క్రికెట్ కిట్, దుస్తులను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను ప్రోత్సహించడానికి రూ.20 వేల విలువ చేసే క్రీడా సామగ్రిని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వాల్యనాయక్, లక్ష్మణ్‌నాయక్, మత్రునాయక్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు అధికారుల హడావుడి

వెల్దండ: సీఎం పర్యటన సందర్భంగా ఆదివారం సెలవు రోజున కూడా మండల స్థాయి అధికారులు హడావుడిగా పనులు చేస్తున్నారు. ఈ నెల 6న నాగర్‌కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు సీఎం కేసీఆర్ రోడ్డు ద్వారా వస్తారని, జిల్లా స్థాయి అధికారులు మండల అధికారులకు ఆదేశించారు. దీంతో ఆదివారం హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారికి ఇరువైపుల చెత్తచెదారం తొలగించి శుభ్రం చేస్తున్నారు. అదే విధంగా రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటించారు. చెట్లకు రంగులు వేశారు. మండలంలోని కొట్ర, వెల్దండ, పెద్దాపూర్, రాఘాయపల్లి గ్రామ పంచాయతీల పరిధిలోని రోడ్లకు ఇరువైపుల 3,500 మొక్కలు నాటించారు. ఆయా గ్రామాల 32 మంది కార్యదర్శులను నాలుగు పంచాయతీలకు కేటాయించి పారిశుద్ధ్య పనులను చేయిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈశ్వర్, టీఏలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



రహదారిపై మొక్కలు నాటిస్తున్న అధికారులు

ప్రజల పక్షాన పోరాటం



మాట్లాడుతున్న శేఖర్‌రెడ్డి

కల్వకుర్తి రూరల్: పట్టణంలో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి సాధనకు ప్రజల పక్షాన పోరాడుతామని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట వంద పడకల ఆస్పత్రి కోసం బీజేపీ పట్టణ అధ్యక్షుడు నర్సింహ అధ్యక్షతన నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడారు. కల్వకుర్తి పట్టణం మీదుగా రెండు హైవేలు వెళ్తున్నాయన్నారు. ప్రతినిత్యం ప్రమాదాలు జరిగి ఎంతో మంది గాయపడటంతో పాటు చికిత్స అందక సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా.. ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వ ఆస్పత్రి సాధనకు నిరంతరం పోరాడుతామని హెచ్చరించారు. నర్సింహ, రాఘవేందర్‌గౌడ్, దుర్గప్రసాద్, నర్సిరెడ్డి, కిష్టారెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్యాంసుందర్, సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ నాయకుల వినతి

లింగాల: భారత రాజ్యాంగాన్ని పాలకులు అభాసుపాలు చేస్తున్నారని, దీనిని మీరే అడ్డగించాలని కోరుతూ ఆదివారం నియోజకవర్గ బీజేపీ నాయకులు సతీష్‌మాదిగ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. భారత రాజ్యాంగానికి లోబడి నడుచుకోవాల్సిన పోలీసు వ్యవస్థను రాష్ట్రంలోని బీఆర్ఎస్ పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు న్యాయం చేయాల్సిన ఈ వ్యవస్థ అధికార పార్టీకి చుట్టంగా మారిందని విమర్శించారు. ఫ్రెండ్లీ పోలీసు అని మాటల్లో చెబుతూ కేవలం అధికార పార్టీ నాయకుల చేతిలో బంధీగా మారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలపై అక్రమ కేసులు బనాయిస్తూ బీఆర్ఎస్ నాయకులు ఎన్ని తప్పులు, దౌర్జన్యాలు, భూ కబ్జాలు చేసినా వారిపై చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు మంద్రెకారి బాలాజీ, మంగ్యానాయక్, సలేశ్వరం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



వినతి అందజేస్తున్న బీజేపీ నాయకులు

ప్రభుత్వాన్ని గద్దెదించటం ఖాయం

కల్వకుర్తి: బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ప్రజలే గద్దె దించుతారని మాజీ ఎంపీ హనుమంతరావు అన్నారు. ఆదివారం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లిందని, అసమ్మతి పెరిగిపోయిందని అన్నారు. రాహుల్‌గాంధీ పాదయాత్ర తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పునరొత్తేజం వచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికార పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో నియోజికవర్గ కాంగ్రెస్ అన్ని విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు

వెల్దండ: వెల్దండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలు పంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, చంద్రమోహన్‌రెడ్డి, మట్ట వెంకటయ్యగౌడ్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీ వీహెచ్

సామాజిక సేవే ‘ఐక్యత’ లక్ష్యం

కల్వకుర్తి రూరల్: సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడమే ఐక్యత ఫౌండేషన్ లక్ష్యం అని చైర్మన్ సుంకిరెడ్డిరాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తాండ్రలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పనే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎల్లమ్మ, అల్లాజి, ఆనంద్, వెంకటయ్య, శేఖర్ పాల్గొన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

‘బలగం’ స్ఫూర్తితో కలుసుకున్నారు



లింగాలలో కలుసుకున్న అన్నదమ్ముల సంతానం

లింగాల: ఇటీవల కాలంలో సంచలనం రేపిన ‘బలగం’ సినిమా పలు కుటుంబాలను ఒకే దగ్గరకు చేర్చేందుకు దోహదపడుతుంది. కొన్నేళ్లుగా ఒకే కుటుంబానికి చెందిన వారు వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార రీత్యా ఉంటూ బంధాలు, బంధుత్వాలు మరచిపోయి జీవనం కొనసాగిస్తున్నారు. లింగాలకు చెందిన లోసరి మల్లయ్య, లోసరి లిక్కిడయ్య అన్నదమ్ములు. వీరు కొన్నేళ్ల కిందట మృతిచెందారు. వీరి ఇరువురి సంతానం 150 మంది వరకు ఉండగా.. కుమారులు, కుమార్తెలు కోడళ్లు, అల్లుళ్లు, మనుమలు, మనుమరాళ్లు, ముని మనుమలు, మునిమరాళ్లు ఎవరు ఎక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి నెలకొంది. నల్గొండ శ్రీనివాసులు, నల్గొగండ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆ కుటుంబాన్ని ఒకే దగ్గర చేర్చి సంబరాలు జరుపుకునేలా చేశారు. ఆదివారం అందరు ఒకే వేదికపై కలుసుకొని సమ్మేళనం నిర్వహించుకున్నారు. బలగం సినిమా స్ఫూర్తితో తమకు ఇలాంటి కలయిక జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆడ, మగ, పిల్లలు ఒక దగ్గర చేరి సామూహిక భోజనాలు చేసి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

మిషన్ భగీరథ నీరు వృథా..

పెంట్లవెల్లి: మండల పరిధిలోని పెంట్లవెల్లి నుంచి మంచాలకట్ట వెళ్లే దారిలో మిషన్‌భగీరథ నీరు వాల్‌పోయి వృథాగా పారుతుంది. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి వరకు నీరు వృథాగానే పారుతూ ఉంది. మిషన్ భగీరథ అధికారులు మాత్రం ఇంతవరకు దానిని పట్టించుకోలేదు. కొన్ని గ్రామాల్లో నీరు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే.. నీరు వృథాగా పారుతున్నా.. పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని, వెంటనే మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

